

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## ఎంపీ వేమిరెడ్డి పీఏ అంటూ దందాలు చేసే నకిలీ పీఏ అరెస్టు

**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పీఏ అంటూ.. బెదిరింపులకు దిగిన నకిలీ వ్యక్తిని దర్గామిట్ట పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. తిరుపతికి చెందిన నదీమ్ అనే వ్యక్తి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పీఏ అంటూ జమ్ములమడుగుకు చెందిన గొల్ల నరేష్ అనే వ్యక్తికి పలుమార్లు ఫోన్ చేసి డబ్బు కోసం బెదిరించారు. దాంతో నరేష్ నెల్లూరు ఎంపీ కార్యాలయానికి సమాచారం అందించారు.. కార్యాలయ సిబ్బంది దర్గామిట్ట పోలీసులకు కంప్లైంట్ చేశారు. దాంతో విచారించిన పోలీసులు నదీమ్‌ను గుర్తించి అరెస్టు చేశారు. ఎంపీ పీఏ అంటూ పలువురిని బెదిరించినట్లు గుర్తించారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. ప్రజలు ఇలాంటి వారిపై అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కార్యాలయం ఒక ప్రకటనలో తరఫున విజ్ఞప్తి చేసింది. పీఏ అంటూ ఎవరైనా ఇలాంటి బెదిరింపు కార్యక్రమాలకు, అక్రమాలకు పాల్పడితే వెంటనే విపిఆర్ కార్యాలయంలో తెలియజేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 1337 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 67.825టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి 700, పెన్నా డెల్టా 2500, కండలేరు వరద కాలువకు 2000 క్యూసెక్కులు, పెన్నా నదికి 1400క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.186 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## కష్టపడిన సంపద చిన్న క్లిక్‌తో మాయమవుతోంది

- సైబర్ క్రైం సమస్య తీవ్రతను సభలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ
- చిన్నతనంలోనే విద్యార్థులకు అవగాహన కల్పించాలి
- ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన హోం మంత్రి అనిత
- పాఠశాల స్థాయిలో అవగాహన పెంచేలా కృషి చేస్తున్నాం
- సైబర్ మోసాలు.. సమాజ భద్రతకు అతిపెద్ద సవాల్
- సైబర్ నేరాలపై శిక్షలు కఠినంగా అమలు చేయాలి
- సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం



**కోవూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** నేటి టెక్ యుగంలో సైబర్ క్రైం అనేది ఒక వ్యక్తి సమస్యలా కాకుండా సమాజ భద్రతకు పెను సవాల్ గా మారిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సైబర్ క్రైం అంశంపై గురువారం ఆమె అసెంబ్లీలో మాట్లాడారు. డిజిటల్ లావాదేవీలు పెరిగిన కొద్దీ, డిజిటల్ నేరాలు కూడా పెరుగుతున్నాయని, ప్రజల అమాయకత్వాన్నే ఆయుధంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పార్ట్‌టైమ్ జాబ్స్, ట్రేడింగ్, మ్యాట్రిమోని పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని ఆవేదన చెందారు. OTP, KYC పేరుతో మోసాలు, సోషల్ మీడియా అకౌంట్ల హ్యాకింగ్, ఫేక్ జాబ్, లాటరీ, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపుల బాధిత కుటుంబాలకు జీవితాంతం మరిచిపోలేని గాయాలుగా మారుతున్నాయన్నారు. కష్టపడి సంపాదించిన డబ్బు నిమిషాల్లో మాయమవుతోందని చెప్పారు. ఉదాహరణకు కోవూరుకు చెందిన ఒక మహిళకు కేవైసీ పేరుతో వచ్చిన లింక్ క్లిక్ చేసి 2 లక్షలు పోగొట్టుకున్న విషయాన్ని ఆమె సభలో ప్రస్తావించారు. సైబర్ క్రైం కంట్రోల్‌కు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. 24/7 కాల్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ సెల్‌లను బలోపేతం చేయాలని, ఫిర్యాదు చేసిన వెంటనే ఫాస్ట్ ట్రాక్ యాక్షన్ సిస్టమ్ ఉండాలన్నారు. బ్యాంకులు, టెలికాం కంపెనీలతో స్ట్రాంగ్ కోఆర్డినేషన్, సైబర్ నేరాలపై కఠిన శిక్షలు ఉండాలన్నారు. అలాగే ప్రజలు కూడా ఎవరికీ OTP, PIN, బ్యాంక్ వివరాలు చెప్పకూడదని, అనుమానాస్పద లింకులపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దన్నారు. మోసం జరిగితే ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, డిజిటల్ ఇండియా బలంగా ఉండాలంటే, సైబర్ భద్రత ఇంకా బలంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్‌పై పోరాటం అంటే కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రభుత్వ విధానం, వ్యవస్థ, ప్రజల అవగాహన మూడు కలిసి నడవాల్సిన అవసరాన్ని ఆమె వెల్లడించారు.

### హోం మంత్రి అనిత స్పందన

అనంతరం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. కంటికి కనిపించని శత్రువులా సైబర్ క్రైం జరుగుతోందని, ఇందులో మోసపోతున్న అనేక మంది చదువుకున్న, ఉన్నత స్థితిలో ఉన్నవారేనని ఆమె పేర్కొన్నారు. గ్రామాలకు కూడా ఈ ధోరణి పెరుగుతోందన్నారు. 10 వ తరగతికే ఉద్యోగాలు అంటూ మయన్మార్, థాయ్‌ల్యాండ్, ఇతర దేశాలకు పంపిస్తామంటూ మోసాలు చేస్తున్నారని అన్నారు. ఇటీవల ఏపీకి చెందిన 110 మందిని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో రక్షించామన్నారు. సైబర్ క్రైంపై అవగాహన చాలా అవసరమని, అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం వచ్చిన తర్వాత 1596 అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. 1930 అనే ఒక హెల్ప్ లైన్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రజల్లో డిజిటల్ అరెస్టుల పేరుతో ఒక భయం ఏర్పడుతోందని, అమ్మాయి లను కూడా ఎరగా వాడుతున్నారని అన్నారు. బిజినెస్ టిప్స్ అనే పేరుతో డబ్బులు దండుకుంటు న్నారని అన్నారు. సీఎం చంద్రబాబు ఈ విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రతి జిల్లాలో సైబర్ సెల్ ఏర్పాటు చేశారన్నారు. 26 జిల్లాల్లో సైబర్ పోలీస్ స్టేషన్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒక కమిటీ ఏర్పాటు అయిందని, ఇప్పటికే రెండు సమావేశాలు పూర్తయ్యాయని, తప్పకుండా సైబర్ నేరాలను కట్టడి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే పోలీసు సిబ్బందిలో కూడా సైబర్ మోసాలపై ప్రత్యేక ట్రైనింగ్ ఇవ్వాల్సి ఉందన్నారు. పక్కా ప్రణాళికతో దీనిపై ముందుకు సాగుతున్నామని చెప్పారు.

## అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ పై శిక్షణ




**చిల్లకూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త** గ్రామ యువత, మహిళలు వృద్ధులు ఇంటి స్థాయిలో ఉత్పత్తి అయ్యే ఘన, ద్రవ వ్యర్థాలను నిర్వహించడంలో నైపుణ్యాలను నేర్చుకునేలా చేయడానికి, అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చిల్లకూరు మండలం తమినపట్నం గ్రామ పంచాయతీలోని గుమ్మలదిబ్బ గ్రామంలో అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్‌లో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. యువకులు, మహిళలు, వృద్ధులు, మత్స్యకార సమాజం కాపులు, అంటే తమినపట్నం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, పెద కాపు, వెంకటేశ్వర్లు, తమినపట్నం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్ సుబ్రమణ్యం, రాందాస్, పోలయ్య పారిశుద్ధ్య నిర్వహణ శిక్షణ కార్యక్రమంలో నిర్వహించారు. యువతకు సోషల్ వెల్ఫేర్ గ్రూప్ సభ్యులు మునుస్వామి, కె నాగేంద్ర, గ్రూప్ సభ్యులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. వ్యర్థాలను సరిగ్గా పారవేసే అలవాటును పెంపొందించడం ద్వారా ఇంటి స్థలం మరియు గ్రామ దారులను శుభ్రంగా ఉంచడానికి అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ దిశలో పారిశుద్ధ్య నిర్వహణ శిక్షణా ప్రచారం నిర్వహిస్తామన్నారు.

## కంపసముద్రంలో గ్రంథాలయం ఏర్పాటుకు కృషి

- మేకపాటి శాంతికుమారి

**మర్రిపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మేకపాటి శాంతికుమారి మర్రిపాడు మండలంలోని తమ స్వగ్రామమైన కంపసముద్రం గ్రామానికి రావడంతో గ్రామస్తులు, యువకులు, బాణాసంచా, డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా స్థాయి పదవిని చేపట్టిన తర్వాత తొలిసారిగా స్వగ్రామానికి రాగా గ్రామమంతా సందడి వాతావరణం నెలకొంది. తాను చదివిన పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మమేకమై మాట్లాడారు. స్కూల్ ఆవరణలో గ్రంథాలయ ఏర్పాటుకు ప్రత్యేకంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ర్యాలీగా బయలుదేరి గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో గ్రామ పెద్దలు, యువకులు మాట్లాడుతూ తమ గ్రామం నుంచి జిల్లా స్థాయిలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా ఎన్నిక కావడం గర్వకారణమన్నారు. మేకపాటి శాంతికుమారికి అభినందనలు తెలిపారు. మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కంపసముద్రంగ్రామం తమకు ఎంతో ప్రత్యేకమని ఈగ్రామంలోనే తాను అక్షరాభ్యాసం చేశానని గుర్తు చేశారు. గ్రామ ప్రజలు ఎంతో సున్నితమైన మనసు కలవారని, మేకపాటి శాంతికుమారికి ఎల్లప్పుడూ అండగానిలవాలని కోరారు.





### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మేకపాటి శాంతికుమారి మాట్లాడుతూ

తాను ఎంత ఎదిగినా తన సొంత ఊరిలో మీ మనిషిగా ఉంటానన్నారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. గతంలో ముస్లిం సోదరులు , యాదవసోదరులకు సహాయం చేస్తానని ఇచ్చిన హామీ కొన్ని కారణాల వలన వాయిదా పడిందని, అందుకు గ్రామస్తులు క్షమించాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం రంజాన్ పర్వదినాన్ని గ్రామ మసీదు మరమ్మత్తులకు 2లక్షల రూపాయల చెక్కునఉ ముస్లిం సోదరులకు అందజేశారు. యాదవ సామాజిక వర్గానికి 2లక్షల చెక్కును గ్రామస్తుల సమక్షంలో అందించారు. తన ఎదుగుదలను ఓర్వలేక కొందరు రాజకీయాలు చేస్తున్నారని , ఎవరు ఎన్ని రాజకీయాలు చేసినా భయపడేది లేదని స్పష్టం చేశారు.నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం కాకాణి



**పొదలకూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** పొదలకూరు మండలం, నావూరుపల్లి లో పర్యటించిన మాజీ మంత్రి వర్యులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు 'డా కాకాణి గోవర్ధన్ రెడ్డి రైతులకు యూరియా అందించడం లో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కాకాణి మడిపాటు కూటమి పాలనలో ప్రజా ప్రతినిధులు దోపిడీలకు పాల్పడడం తప్ప, ప్రజల గురించి పట్టించుకునే సమయం లేదు సోమిరెడ్డి శివరాత్రి నాడు కాకుటూరు శివాలయం భూములు తాను అమ్మలేదని చెప్పి తెలివిగా తప్పించుకో చూశాడని, కానీ శివాలయం భూములు ఆక్రమించుకుని లేఅవుట్ వేసిన యజమాని దగ్గర తాను ముడుపులు తీసుకోలేదని , శివరాత్రి నాడే ప్రకటించాలని డిమాండ్ చేసినా పారిపోయాడని ఎద్దేవా చేసిన కాకాణి సర్వేపల్లి నియోజకవర్గం లో దోపిడిలు, దుర్మార్గాలు, అవినీతి ,అక్రమాలు తప్ప అభివృద్ధి, సంక్షేమం, ఊసే లేదు సోమిరెడ్డి హయాంలో సర్వేపల్లి లో సర్వం దోపిడి కి గురైంది. ఇసుక, గ్రావెల్, మట్టి, బూడిద, దోచుకోవడం తోపాటు లేఔట్ల యజమానులు దగ్గర డబ్బులు గుంజడం, ఉద్యోగుల బదిలీలకు డబ్బులు వసూలు చేయడం ,పంచాయతీల పేరిట సొమ్ములు వసూలు చేయడం, పనులు చేయకుండానే ఇరిగేషన్ లో దొంగ బిల్లు చేసుకోవడం లాంటివి తప్ప, ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ఇష్టపడటం లేదు. నావురుపల్లి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మక్కిన వెంకటేశ్వర్లు నాయుడు కుమారుడు "డా" అవినాష్ రావు, ముందస్తు వివాహ వేడుక కార్యక్రమంలో పాల్గొన్న కాకాణి

## ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి



**నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త** నెల్లూరు నగరంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని హిందూ సంఘాలు ఘనంగా నిర్వహించాయి. బీజేపీ నాయకులు, ఆర్ఎస్ఎస్ నేతలు, ఏబీవీపీ నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఓ వాహనంలో ఉంచి దేశభక్తితో వివిధ వర్ణాల పుష్పాలతో అందంగా అలంకరించారు. కాషాయ జెండాలను చేతపట్టుకుని వీఆర్సీ మైదాన నుంచి జై శ్రీరామ్ నినాదాలతో నెల్లూరు నగరంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. దీంతో నెల్లూరు నగరం అంతా కాషాయమయమైంది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్య సాహసాలు, పరిపాలన ప్రతిభను స్మరించుకున్నారు. శివాజీ మహారాజ్ చూపిన మార్గంలో నడుస్తూ దేశాభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మరో వైపు మరాఠీ మిత్రమండలి ఆధ్వర్యంలో కూడా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



## ఇల్లు కాలిపోయిన పేద కుటుంబానికి టీడీపీ ఆర్థిక చేయూత



**పొదలకూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఆర్.వై.పాలెం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమై తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్న పేద కుటుంబానికి గ్రామ టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు కలిసి గుతువారం ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు వారి పరిస్థితిని తెలుసుకుని తక్షణ అవసరాల కోసం రూ.30,000 నగదు సహాయం అందించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో పార్టీ తరఫున అండగా నిలుస్తామని, అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నాయకులు మాట్లాడుతూ అగ్నిప్రమాదంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, సమాజంలోని దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలని కోరారు. గ్రామ ప్రజలు కూడా బాధిత కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అలుపూరు శ్రీనివాసులు, కండే సురేష్ బండి, మనోజ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అమ్మకం దారులు అరెస్ట్

- 340 గ్రాముల గంజాయి స్వాధీనం

**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రాల నుంచి నెల్లూరుకు గంజాయి తీసుకొచ్చి విక్రయాలు జరిపే వ్యక్తితో పాటు మరో వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 340 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మోతిలాల్ స్థానిక ఆటోనగర్ లో గ్యాస్ వెల్డర్‌గా పనిచేస్తూ ఉంటాడు. అతను ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుండి అక్రమంగా గంజాయిని తీసుకొచ్చి ఆటోనగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో విక్రయాలు జరుపుతూ ఉంటాడు. రామకోటయ్య నగర్‌కు చెందిన షఫీ గంజాయి సేవించడంతోపాటు మోతులాల్ వద్ద కొనుగోలు చేసి ఇతరులకు గంజాయి విక్రయిస్తుంటాడు. వీరి గంజాయమ్మకాలపై పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి ఆటోనగర్లో దాడులు నిర్వహించగా, షఫీ గంజాయి సేవిస్తూ దొరికాడు. అతని ఇచ్చిన సమాచారంతో మోతిలాల్‌ను కూడా ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 340 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

## కూలేందుకు సిద్ధంగా ఉన్న తాగునీటి ట్యాంకు

- నిత్యం భయంభయంతో స్థానిక ప్రజలు
- పగుళ్ళతో వృధాగా పోతున్న తాగునీరు





**సైదాపురం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త** మండల పరిధిలోని అనంతమడుగు గ్రామ పంచాయతీలో ఉన్న తాగునీటి ట్యాంకు శిధిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో స్థానిక ప్రజలు ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కనీసం పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. సుమారు 40ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకు ప్రస్తుతం శిధిలావస్థకు చేరడంతో స్థానికులు భయపడుతున్నారు. వాటర్ ట్యాంకు సమీపంలో సచివాలయం, ప్రభుత్వ పాఠశాల, అదే విధంగా చుట్టుపక్కల నివాసాలు ఉండటంతో భయబ్రాంతులకు గురవుతున్నారు. వాటర్ ట్యాంకుకు సంబంధించి మెట్లు, స్తంభాలు, ట్యాంకుపై భాగంలో పగుళ్లు వచ్చి నిత్యం నీరు వృధాగా పోతుంది. దీంతో ట్యాంకు పరిసర ప్రాంతాలు రొచ్చురొచ్చుగా మారిపోతున్నాయి. అంతే కాకుండా ట్యాంకు ఫిల్లర్ల కింద భాగంలో పెచ్చులూడిపోయి ఇనుపకమ్మెలు తుప్పుపట్టిపోయి ఉన్నాయి. ఇంతటి శిధిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం కావడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏదైనా జరగరానిది జరిగి ప్రాణనష్టం వాటిల్లితేనే అధికార యంత్రాంగం స్పందిస్తుందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ వాటర్ ట్యాంకుపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలేందుకు సిద్ధంగా ఉన్న ట్యాంకును తొలగించి నూతన ట్యాంకును ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్‌ను వివరణ కోరగా అనంతమడుగు గ్రామానికి నూతన వాటర్ ట్యాంకు ఏర్పాటుకు ప్రతిపాధనలు ఉన్నతాధికారులకు పంపడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న వాటర్ ట్యాంకును పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## పన్నులను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించండి

మార్చి 14న నేషనల్ లోక్ అదాలత్

కమిషనర్ వైఓ.నందన్



**నెల్లూరు కార్పోరేషన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్నులు, తాగునీటి కుళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నుల ఎగవేతదారులపై క్రిమినల్ చర్యలు, రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగానికి న్యాయస్తానాల ద్వారా నోటీసులను పంపనున్నామని సకాలంలో పన్నులను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ వైఓ.నందన్ తెలిపారు. నగరపాలకసంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరపాలకసంస్థకు చెల్లించాల్సిన పన్ను బకాయిదారులకు సంబంధిత విభాగాల నుంచి నోటీసులను జారీ చేయనున్నామని, వారంతా నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయస్థానంలో రాబోవు మార్చి 14వ తేది శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌కు హాజరై కోర్టు కేసులను మాఫీ చేసుకోవాలని కమిషనర్ సూచించారు. కార్పోరేషన్ 2025-26 ఆర్తిక సంవత్సరానికి గానూ ఆస్థిపన్ను 247కోట్లు, ఖాళీ స్థలం పన్ను 37కోట్లు, తాగునీటి కొళాయి పన్ను 63కోట్లుగా మొత్తం 347కోట్లుగా బకాయిలు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది మొండి బకాయిలతో పాటు ప్రస్తుత డిమాండ్ మొత్తం 347కోట్లుకు గానూ ప్రస్తుతానికి రూ.90కోట్లు మాత్రమే వసూలు చేశామని ఇంకా 257కోట్లు మొండి బకాయిలుగా ఉన్నాయని తెలిపారు. బకాయిలు చెల్లింపు అవగాహన కోసం వివిద ప్రసార మాద్యమాలు, సామాజిక మాద్యమాల ద్వారా, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు ద్వారా, నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం సిబ్బంది ద్వారా నోటీసులను అందజేసి ఉన్నామని కమిషనర్ తెలిపారు. గతంలో జరిగిన నేషనల్ లోక్ అదాలత్ ద్వారాసుమారుగా వెయ్యిమందికి పైగా నోటీసులు అందజేసి వారినుంచి 12కోట్లు వసూలుచేశామని తెలిపారు. బకాయిలు ఉన్న వారందరికి జాతీయ లోక్ అదాలత్ ద్వారా నోటీసులు జారీ చేయనున్నామని తెలిపారు. మొండి బకాయిదారులపై రెవెన్యూ రికవరీ యాక్ట్ కూడా ప్రయోగించబోతామని కమిషనర్ స్పష్టం చేశారు. మార్చి 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు హాజరై కేసులను మాఫీ చేసుకోవాలని సూచించారు. నగరవ్యాప్తంగా జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన మూలధనం కేవలం పన్నుల వసూళ్ళ ద్వారా మాత్రమే ఖర్చు చేయగలనమి బాద్యతగా బావించి బకాయిదారులందరూ నిర్దేశించిన సమయంలో పన్నులను చెల్లించాలని కమిషనర్ సూచించారు.

## కళ్యాణం.... కమనీయం ...

శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి కళ్యాణ వైబోగం




**బుచ్చి ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** ముత్యాల తలంబ్రాలు! మంగళవా యిద్యాలు!! వేదమంత్రోచ్చరణ నడుమ శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ కళ్యాణ!!! వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. బుచ్చిరెడ్డిపాళెం రామకృష్ణానగ ర్‌లోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామి వారి కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారి కళ్యాణం తిలకించి పరవశించారు. అర్చకులు వేదమంత్రోచ్చరణ నడుమ స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.అర్చకులు స్వామి వారి కళ్యాణంలో ప్రతి ఘట్టాన్ని విశ్లేషిస్తు కళ్యాణం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా దివంగత రామిశెట్టి బాస్కర్‌రావు జ్ఞాపకార్ధం సతీమణి రమణమ్మ, కుమారుడు రామిశెట్టి కళ్యాణ్‌కుమార్, సతీమణి ఝాన్సీలక్ష్మీ , కొంజేటి వెంకట శేషయ్య సతీమణి రాజ్యలక్ష్మీ, మద్యహ్నం 12 గంటలకు ప్రసాద వితరణ ఉభయకర్తలుగా దివంగత రామిశెట్టి బాస్కర్‌రావు జ్ఞాపకార్ధం సతీమణి రమణమ్మ, కుమారులు రామిశెట్టి మురళీకృష్ణ, రామిశెట్టి మోహన్‌రావు,రామిశెట్టి కళ్యాణ్‌కుమార్ వ్యవహారించారు.

## త్వరలో డీఎస్సీ.. నిరుద్యోగుల్లో ఆనందం

**కోట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** జాబ్‌క్యాలెండర్‌లో భాగంగా త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ స్పష్టం చేయడంతో టిటిసీ పూర్తి చేసిన నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆమేరకు గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ఆయన మాట్లాడారు. ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ఇటీవల మంత్రి లోకేశ్ కూడా హామీ ఇచ్చారు. ఆమేరకు నోటిఫికేషన్‌కు ప్రణాళిక సిద్ధం చేశారు. ఊగాది పండగ సందర్భంగా ఉపాధ్యాయ నియామకాలకు ప్రకటన విడుదల చేస్తారని అధికార వర్గాలు ఇక్కడ తెలిపాయి. ఇప్పటికే మండలాల వారీగా ఖాళీలను ప్రభుత్వం సేకరించింది. నెల్లూరు జిల్లాలో 600 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఆమేరకు కోట మండలంలో 20 పోస్టుల ఖాళీల వివరాలను ఇటీవల ప్రభుత్వానికి పంపినట్లు కోట మండల విద్యాశాఖధికారి డి.మస్తానయ్య ప్రభాతవార్త కు తెలిపారు.

## మన్‌కీబాత్‌పై ఎస్సీ మోర్చా ద్వారా విస్తృత కార్యక్రమాలు



**నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** ఎస్సీ మోర్చా నెల్లూరు జిల్లా అధ్యక్షులు డీఎస్ పరశురాం అధ్యక్షతన జిల్లా ఎస్సీ మోర్చా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పోలిచర్ల ఉదయ్ కుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కంటేటి బ్రహ్మయ్య పాల్గొన్నారు. అనంతరం మన్‌కీ బాత్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత మన్‌కీ బాత్ కార్యక్రమం తప్పకుండా నిర్విరామంగా జరుగుతోందని, అందులో భాగంగానే దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలే కాకుండా క్రింది స్థాయి ప్రజలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, హాస్టల్ విద్యార్ధులకు సైతం దేశం పట్ల అవగాహన బాధ్యత కలిగే విధంగా కార్యక్రమాలను రూపొందించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఎస్సీ మోర్చా ద్వారా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్ధులకు ప్రధానమంత్రి మనసులో మాట కార్యక్రమాన్ని వీక్షించే విధంగా చేసి అనంతరం కార్యక్రమంపై క్విజ్ కాంపిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి, బహుమతులు, సర్టిఫికేట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సగిలి గురవయ్య, ఏవీ రమణయ్య, రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కొండ బిట్రగుంట లో శ్రీవారి రథం ట్రయల్ రన్



**బిట్రగుంట ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** బోగోలు మండలం కొండ బిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మరో పది రోజులలో ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం శ్రీ ప్రసన్నుడి రథంను ట్రయల్ రన్ నిర్వహించారు. గత రెండు సంవత్సరాలనుండి రథోత్సవం లో అపశ్రుతులు జరుగుతుండటంతో ఈ ఏడాది ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగేలా రెవిన్యూ, పోలీస్, ఆర్అండ్ బి, ట్రాన్సకో, దేవాదాయ శాఖ అధికారులు దగ్గర ఉండి ట్రయిలు రన్ నిర్వహించడం జరిగింది. ఇందులో ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతం కావడం తో బ్రహ్మోత్సావాలలో కూడ ఇదే విదంగా నిర్వహించి ఉత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

## నేడు నేదురుమల్లి జయంతి



**నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** మాజీ మంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి 91వ జయంతి వేడుకలను నెల్లూరులోని ఇందిరాభవన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 10గంటలకు పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించనున్నారు. ఇందిరాభవన్‌తో పాటు, జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదేళ్లపాటు రాష్ట్రానికి చేసిన సేవలతో పాటు నెల్లూరు జిల్లాకు ఆయన అందించిన సేవలను ప్రజలకు వివరిం చనున్నారు.

## జేపసి పిలుపు మేరకు ధర్నా



**గూడూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** గత రెండు నెలలుగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో పనిచేస్తున్న సిబ్బంది యొక్క న్యాయమైన డిమాండ్ల పరి ష్కార సాధన కొరకు వివిధ దశలలో ఆందోళన కార్యక్రమాలు చేసారు. అందులో భాగంగా 16వ తారీకు నుండి పూర్తిగా సంఘాలను మూసివేసి నిరసన కార్యక్రమం తెలియజేసారు. గురువారం రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బ్రాంచి పరిధిల ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రేపటి నుండి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ముందు 24 తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడును అప్పటికి మా న్యాయమైన కోర్కెలైన 36 జీవన్ పూర్తిస్థాయిలో అమలు పరచాలని పదవి విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని సిబ్బంది కొరత వల్ల 2019లో కొంతమంది సిబ్బందిని నియమించుకోవడం జరిగినది వారిని పరిమినెంట్ చేయాలని గ్రాట్యూటీ చట్టాన్ని అమలుపరిచి ఐదు లక్షల వరకు గ్రాట్యూటీ ఇవ్వాలని ఇన్సూరెన్స్ సౌకర్యము ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్లపై గూడూరు బ్రాంచ్ నందు ఉమ్మడి నెల్లూరు జిల్లా జనరల్ సెక్రెటరీ రామానాయుడు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు నెంబర్ 24 పిఎస్ ఎస్‌సిట వై నారాయణ, చిల్లకూరు పిఏసిఎస్ నుంచి మల్లేశ్వరయ్య, జయంపు పిఏసిఎస్ నుంచి ముకుంద, సంఘ సిబ్బంది ఈ ధర్నాకు సంఘీభావంగా గూడూరు బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



**గూడూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ చైతన్య వేదిక కన్వీనర్ మల్లికార్జున మాట్లాడుతూ హిందూ హృదయ సామ్రాట్ హిందువుల ఆరాధ్య దైవం మరాఠా యోధుడు భరతమాత ముద్దుబిడ్డ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా గూడూరు పట్టణం నందు భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ బైక్ ర్యాలీలో 200 బైకులు పాల్గొన్నాయన్నారు. లోక కళ్యాణం కోసం హిందువులందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రపంచమంతా హిందుత్వం పెరుగుతోందని ప్రపంచ శాంతి కోసం హైందవ ధర్మం ఎప్పుడు ముందుంటుందని తెలియజేశారు. భవాని మాత ఆశీస్సులతో హిందూ సామ్రాజ్య స్థాపన కోసం అహర్నిశలు కృషి చేసి తన జీవితం మొత్తం హైందవ ధర్మాన్ని కాపాడుటకై ప్రాణాలు అర్పించిన మహావీరుడు ఛత్రపతి శివాజీ అని, ఆ మహనీయులను ఆదర్శంగా తీసుకొని హిందువులందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు యుగంధర్, కిషోర్ జయరామ్ ప్రసాద్ రెడ్డి రాజేష్ దయాకర్ మనోజ్ బాలకృష్ణ నాయుడు, కిరణ్, సురేందర్ రెడ్డి, బైరప్ప, చంద్రనీల్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న జర్నలిస్టుకు దాతల సహకారంతో మీడియా ప్రతినిధులు చేయూత



**చిల్లకూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** ఓజిలి మండలం చిలమానుచేను గ్రామానికి చెందిన తలారి నాగరాజు గూడూరు ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్నాడు. అతనికి మధుమేహం ఎక్కువ కావడంతో కిడ్నీలు పాడయ్యాయి. అంతే కాకుండా కంటి చూపు కూడ తగ్గింది. నిరుపేద కుటుంబం కావడంతో సరైన వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో నాగరాజు కుటుంబం ఉంది. ఈ నేపధ్యంలో భాగంగా గూడూరుకు చెందిన ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పలువురు స్పందించారు.వెంటనే రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు రాజనేని శ్రీనివాసులు నాయుడు 15 వేలు, పెన్వర్ కంపెనీ డైరెక్టర్ గంటా మధు క్రిష్ణ మరో 15 వేల రూపాయలను అందజేశారు. 30వేల రూపాయల నగదును చిలమానుచేను గ్రామంలో ఉంటున్న నాగరాజు కుటుంబానికి గురువారం అందజేశారు. ఇంకా మరికొంత మంది ఫోన్ ట్రాన్సక్షన్ ద్వారా వారికి తగిన సాయం అందజేశారు. అందువల్ల దాతలు స్పందించి నాగరాజు వైద్యానికి సాయం అందించాలని ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆల్తాఫ్, అనీల్, రఘు, సతీష్, మస్తాన్ తదితరులు కోరారు.

## గల్లంతయిన యువకుడు ఇసుకపల్లిలో తేలాడు



**బిట్రగుంట ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** బోగోలు మండలం తాటి చెట్ల పాలెం సముద్ర తీరాన ఇటీవల దగదర్తి మండలం ఉలవపాళ్ళ కు చెందిన ముగ్గురు యువకులు సముద్ర స్థానానికి వెళ్లగా అందులో ఇద్దరు యువకులు గల్లంతు కాగా ఒకరు మృతి చెందాగా మరొకరు గల్లంతు అయ్యారు. గల్లంతు అయిన నూనె. లోకేష్ (23) మృతదేహం అల్లూరు మండలం ఇస్కపల్లి సముద్రం ఒడ్డుకు చేరి లభ్యం అయినట్లు బిట్రగుంట ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు. మృతదేహంను శవపరీక్ష నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు తెలిపారు.

## చదవడం రాయడంపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు ఫిబ్రవరి19 ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి చదవడం రాయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరులోని ఎన్టీఆర్ నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థిలో చదవడం రాయడంపై ప్రత్యేక దృష్టి పెటాలన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని ఇచ్చిన మెనూను సక్రమంగా అమలు పరిచేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

## ప్రాథమిక దశ నుంచి క్రీడలపై దృష్టి సారించాలి



**కోవూరు ఫిబ్రవరి19 ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి క్రీడలపై దృష్టి సారించాలని న్యూలిటిల్ ఫ్లవర్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల కరస్పాండెంట్ వై. నందకిషోర్ అన్నారు. స్థానిక కోనమ్మతోటలోని ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో రెండు రోజుల పాటు క్రీడా మహో త్సవాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు దేహదారుడ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఇటువంటి క్రీడల్లో పాల్గొనడం వలన వారిలో దాగిఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. తమ పాఠశాలలో కేవలం చదువే కాకుండా క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. డైరెక్టర్ అనిత మాట్లాడుతూ తమ పాఠశాల ప్రారంభం నుంచి ఇప్పటివరకు నూరుశాతం ఫలితాలతో పాటు క్రీడల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధించి తమ పాఠశాల పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేశామన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధనోపాధ్యాయుడు కోటయ్య, ఇన్‌చార్జిలు బాలసుబ్రహ్మణ్యం, విజయ , పీఈటీ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.

## నలంద వరల్డ్ స్కూల్ నందు యాన్యువల్ డే సెలబ్రేషన్స్



**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని వెంగళరావు నగర్‌లో ఉన్న నలంద వరల్డ్‌స్కూల్ నందు యాన్యువల్‌డే పంక్షన్ ఘనంగాజరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు ఆటపాటలతో అలరించి పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నలంద విద్యాసంస్థల అధినేత ఎండి మజాహర్ పాల్గొని మాట్లాడారు. విద్యార్తిని, విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ కలిటి ఉండాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులుగా ఎదిగి దేశాన్ని ప్రగతి పదంలో పయనించేలా చేయాలని తెలిపారు. ప్రతి విద్యార్థి కష్టపడి, ఇష్టపడి చదివి వారి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి గుర్తింపు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్‌లు వహీం, సహీం, ప్రధాన ఉపాద్యాయురాలు పరిదా, ఉపాద్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా సలాంబాబా గంధ మహోత్సవం



**అనుమసముద్రంపేట, ఫిబ్రవరి19,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేట కొండపై వెలసిన సలాంబాబా 31వ గంథమహోత్సవాన్ని బుధవారం రాత్రి అంగరంగవైభవంగా నిర్వహి ంచారు. గంథ కలశాన్ని సలాం బాబా ఇంటి నుండి సలాంబాబా మనుమడు సయ్యద్ నాయబ్ తలపై ఉంచుకొని మేళతాళాలతో, భక్తి కీర్తనలతో, ఫకీరుల జరబులతో, బాణాసంచా ను కాలుస్తూ ఊరేగింపుగా గ్రామ పురవీధుల గుండా తీసుకు వెళ్ళి స్థానిక పెద్ద దర్గా అయిన ఖాజా నాయబ్‌రసూల్ స్వామివారి దర్గాలో గంధం ఎక్కించి అనంతరం ఫక్రుద్దీన్ బాబా దర్గాలో గంధం ఎక్కించి అక్కడి నుండి సలాం బాబా తండ్రి అజీస్‌బాబా దర్గాలో గంధ లేపనం చేసి అనంతరం సలాం బాబా దర్గాకు చేరారు. అక్కడ ప్రత్యేక సలాములు పాడి ఫాతిహా చదివి దువా చేసి సలాం బాబా సమాధికి గంధ లేపనం చేసి భక్తులకు గంధ ప్రసాదాలు పంచిపెట్టారు. గంధమహోత్సవం సందర్భంగాభారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గంథమహోత్సవానికి సలాం బాబా భక్తులు భారీగా హాజరయ్యారు. గంధమహోతసవ కార్యక్రమాలను సలాం బాబా కుమారులు సయ్యద్ ఖాజా రహమతుల్లా, సయ్యద్ గౌస్‌బాషల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్థానిక ముస్లిం సోదరులు ఎస్.జి.ఎన్.ఫయాజ్‌అహ్మద్, సయ్యద్ గులాం రసూల్, ఎం.డి.రహమత్‌అలీ, పఠాన్ ఫిరోజ్ , షేక్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**చిల్లకూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** చిల్లకూరులోని వరగలి క్రాస్ రోడ్ సమీపంలో ఉన్న భారత్ పెట్రోల్ బంకు వద్ద బుధవారం రాత్రి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాగా ఇద్దరికి గాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి గూడూరు పట్టణంలోని బొగ్గుల దిబ్బకి చెందిన మైపాడు సాయి మహేష్‌గా స్థానికులు గుర్తించారు. స్థానిక పోలీసులు మైపాడు సాయి మహేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ




**గూడూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ నందు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీలక్ష్మి, పీఎం రావు దంపతులు దాతృత్వంతో హాకీ క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా క్లబ్ ఉపాధ్యక్షులు సనత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ శ్రీలక్ష్మి పీఎం రావు దంపతులు ప్రతి నెల క్రమం తప్పకుండా హాకీ క్రీడాకారులకు పౌష్టికాహారం అందించటం అభినందనీయమని, మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆశిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ రాఘవరెడ్డి, శ్రీకంటి రామ్ మోహన్ రావు, వాసు గౌడ్, ధనంజయ రెడ్డి, మందిపాటి శ్రీనివాసులు, సిద్దా రెడ్డి, గిరిబాబు, కృష్ణంరాజు, సేగు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, దిలీప్ రాజు, నవీన్ జయ కుమార్, కోదండరామయ్య, శ్రీనివాసరావు, పాదర్తి ప్రసాద్, హరినాథ్ రెడ్డి, బలరాం రెడ్డి, హాకీ కోచ్ దీపు, హాకీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించండి



**వింజమూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో చెల్లించాల్సిన పన్నులను చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కావలి డీఎల్‌పీవో పీవీ రమణ తెలిపారు. గురువారం వింజమూరు పంచాయతీ కార్యాలయంలో పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వింజమూరు మండలం మొత్తం పన్నుల డిమాండ్ ఒక కోటి 78 లక్షలు గా ఉందన్నారు. వసూళ్ల కేవలం 35 లక్షల మాత్రమే వచ్చాయని ఇక రావాల్సింది సుమారు కోటి 15 లక్షలు ఉందన్నారు. అలాగే వింజమూరు పంచాయతీలో రావాల్సిన పనులు ఒక కోటి 51,61 వసూళ్ల చేసినవి 54లక్షలని, రావాల్సినవి 98లక్షల మంది ఉన్నారు. ఈ పన్నులు వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటు చేసి పన్ను వసూళ్ల వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ డ్రైవ్ సందర్భంగా రోజుకు మూడు లక్షల వరకు వసూళ్ల చేయాల్సిన లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. పంచాయతీలకు పన్నులు వసూళ్ల కానట్లయితే అభివృద్ధి కుంటుపడుతుందని అందుచేత ప్రజలు విషయాన్ని తెలుసుకుని సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అదే విధంగా ప్రస్తుతం పంచాయతీ పన్నులు కార్యాలయానికి రాకుండానే క్యూఆర్ కోడ్ ద్వారా సెల్‌ఫోన్ ద్వారా చెల్లించుకోవచ్చని ఆయన తెలిపారు. అలాగే ఏకిస్తిపురం బుక్కాపురం చాకలికొండ, గుండెమడగల జనార్ధనపురం, కాటేపల్లి, నల్లగొండ, నందిగుంట, రావిపాడు, శంఖవరం, ఊటుకూరు పంచాయతీలలో రావాల్సిన పనులను సకాలంలో వసూళ్ల చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో కే.రామారావు, డీఎల్‌పీవో కార్యాలయం సిబ్బంది శ్రీనివాసులు, వేణు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కంటి రోగులకు సంజీవినిలా వీపీఆర్ నేత్ర



**వింజమూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** వింజమూరు మండంలోని కంటి చూపు రోగులకు వీపీఆర్ నేత్ర సంజీవినిలా పని చేస్తుందని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో వీపీఆర్ నేత్ర ఉచిత వైద్య కంటి శిబిరాన్ని గూడా నర్సారెడ్డి స్థానిక నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక కంటి సమస్యలతో బాధపడేవారికి ఈ ఉచిత వైద్య శిబిరం ఎంతో ఊరటనిస్తుందన్నారు. వీపీఆర్ దంపతులు పేద ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలను ఉచితంగా అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపడం లక్ష్యంతో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కంటి సమస్యలతో బాధపడే వారు నేత్ర శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారికి కళ్లద్దాలను వెంటనే అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం అధునాతనమైన మొబైల్ ఐ క్లినిక్ ద్వారా పరీక్షించి ఉచితంగా అద్దాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముప్పూరి విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పల్లా పురుషోత్తం, మాజీ సర్పంచ్ మందాది చిన్న రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ మందాది పెద్ద రాఘవరెడ్డి, శ్రీనివాసులునాయుడు, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు మందాది గంగిరెడ్డి, నాయకులు గుండుబోయిన మాధవ, డబ్బుకొట్టి హరిబాబు, ఒల్లెబోయిన రమేష్, ఆనాటి వీరయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వైభవంగా ఉస్తాద్‌బాబా జెండా ఉత్సవం



**అనుమనముద్రంపేట, ఫిబ్రవరి19, ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండల కేంద్రంలో వెలసియున్నహజరత్ మీర్జా మహమ్మద్ హుస్సేన్‌బేగ్ ఉరఫ్ ఉస్తాద్‌బాబా స్వామివారి 58వ గంథమహోత్సవ జెండా ఉత్సవాన్ని ఉర్దూ కాలమానం ప్రకారం నెలవంకను చూసి బుధవారం రాత్రికి వైభవంగా నిర్వహించారు. జెండాను ఉస్తాద్‌బాబా మంజిల్ నుండి ఊరేగింపుగా ఫకీరుల జరుబులతో భక్తి కీర్తనలతో తీసుకెళ్ళి వస్తాద్‌బాబా దర్గా వద్ద గల జెండా కట్టపై కట్టారు. ఈసందర్భంగా ప్రత్యేక సలాములు పాడి దువా చేశారు. మార్చి 2న ఉర్దూ కవిమ్మేళనం, 3న గంధమహోతసవం, 4న ఉరుసు, 5న తహలీల్ ఫతేహాలు వైభవంగా నిర్వహించనున్నామని దర్గా మేనేజ్‌మెంట్ ఎండి రహమత్ అలీ తెలిపారు. జెండా ఉత్సవ కార్యక్రమానికి ముస్లిం సోదరులు ఎస్.జి.ఎన్.ఫయాజ్‌అహ్మద్, సయ్యద్ గులాంరసూల్, షేక్ రహీం, షేక్ ఇమ్దాద్ , షేక్ జంషీద్‌ఎం.డి.రవూఫ్,పి.ఫిరోజ్, పి.సందాని, షేక్ ఖాజా రహమతుల్లా , స్థానికులు , భక్తులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా




**ఆత్మకూరు , ఫిబ్రవరి19,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆత్మకూరు ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఈజాబ్‌మేళాలో సుమారు 21 కంపెనీలు పాల్గొని నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 306మంది నిరుద్యోగులు పాల్గొనగా వీరిలో మంచి ప్రతిభ కనపరచిన 190, తదుపరి ఇంటర్వ్యూకి 17మంది నిరుద్యోగులు ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఎంపిక కాబడిన నిరుద్యోగులకు ఆయా కంపెనీల ప్రతినిధుల ద్వారా నియామక ఉత్తర్వులు అందించారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌డిఓ బి.పావని, మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్, ఆత్మకూరు తహసీల్దార్ పద్మజాకుమారి , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి షేక్ అబ్దుల్ కయ్యూం , ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ శివకృష్ణ, నెల్లూరుజిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, సిడాప్ సిబ్బంది పాల్గొన్నారు.

## కావలి పట్టణంలో అక్రమణలు తొలగింపు



**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని పుల్లారెడ్డి నగర్ స్వర్ణవార్డ్ కార్యాలయం పక్క కొందరు గృహనిర్మాణాలు చేపడుతూ ఇంటి ముందున్న ప్రభుత్వ రోడ్డును ఆక్రమించి అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నందున గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ వెంటనే స్పందించి సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించడం జరిగింది. ప్రభుత్వ రోడ్డును ఆక్రమించి అక్రమంగా ఇంటినిర్మాణాలను చేపడుతున్నందున జేసిబితో తొలగించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో పురపాలక సంఘ పట్టణ ప్రణాళిక అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్ సీట్ ఇప్పిస్తానంటూ మోసం

**నెల్లూరు క్రైమ్ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని రూ. లక్షల్లో నగదు తీసుకుని మోసగించిన వ్యక్తిపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు బివినగర్‌లో హరి నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తెకు పిలిఫిన్స్‌లో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని హైదరాబాద్‌కు చెందిన ఓ మెడికల్ ఎడ్యుకేర్ కన్సల్టెన్సీ నిర్వాహకుడు శ్రీను నమ్మించాడు. ఐదేళ్లకు రూ 35లక్షలు అవుతుందనీ, సీట్ బుకింగ్ కోసం రూ 8.50 లక్షలు అడ్వాన్స్ ఇవ్వాలని చెప్పాడు. దీంతో హరి అతనికి నగదు చెల్లించాడు. రోజులు గడుస్తున్నా సీటు ఇప్పించకపోగా నగదు తిరిగి చెల్లించలేదు. ఈ మేరకు బాధితుడు గురువారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విశ్వనాథరావుపేటలో ఆధార్ కేంద్రం నిర్వహణ



**బిట్రగుంట ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కార్యాలయంలో విశ్వనాథరావుపేట బిట్టు1,2 స్వర్ణ గ్రామాల పరిధిలో గురువారం ఆధార్ నమోదిత కేంద్రాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ శిబిర ంలో కొత్తగా ఆధార్ నమోదు తో పాటు, చిరు నామా, తదితర సవరణలు నిర్వహించారు.

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATIOR MEDCHAL-MALKAJGIRI DIST AT: MEDCHAL.**
**A.C.P. NO : 196 OF 2025**
**Between :**
**KAPIL CHITS (HYD) PVT. LTD.**
KKPT19J-19, KPHB CAO Branch.
**...DISPUTANT**
**AND**
Mr.M VENKATESWARLU & OTHERS
**...OPPONENTS**
To.
1. MR VENKATESWARLU MUKKARAPAKA, S/O. KADIRIVELU, AGED ABOUT :49 YEARS, OCC: SCHOOL ASSISTANT EMP ID NO. 14203745 GOVT OF ANDHRAPRADESH MANDAL EDUCATIONAL OFFICER MANDAL PRAJA PARISHAD TADA MANDAPET SPSR NELLORE. R/O.D.NO. 8-216-6 , RAJEEVNAGAR, SULLURPET SRI POTTI SRIRAMULU NELLORE, ANDHRA PRADESH, INDIA, 00000,
2. MR.SANKARAIAH SIDDU,S/O. RANGADASU,AGED ABOUT :52 YEARS, OCC: SECONDARY GRADE TEACHER EMP ID NO. 0834143GOVT OF ANDHRA PRADESH MANDAL EDUCATIONAL OFFICERM.P OZILI S P S R NELLORE. R/O.D.NO. 7-7-47 LAKSHMAN NAGAR, NAIDUPET SRI POTTI SRIRAMULU NELLORE, ANDHRA PRADESH, INDIA,
3. MR.BALIBOYENA AUDINARAYANA, S/O. RAMASUBBAIAH,AGED ABOUT :56 YEARS,OCC: SECONDARY GRADE TEACHEREMP ID NO. 14207341 GOVT OF ANDHRA PRADESH MANDAL EDUCATIONAL OFFICERM.P OZILI S P S R NELLORE. R/O:D NO 2-39, NEAR MAHALAKSHMI TEMPLE , KADIVEDU, SRI POTTI SRIRAMULU NELLORE, ANDHRA PRADESH, INDIA - 524410
4. MR.ANKITHKUMAR MAVULURU,S/O. RAMAIAH,AGED ABOUT :33 YEARS,OCC: TECHNICIAN EMP ID NO. SH15269GOVT OF INDIA DEPARTMENT OF SPACE INDIAN SPACE RESEARCH ORGANISATION SRIHARIKOTA 524124 R/O:Q NO: C1, D.O.S COLONY, SULLURPET, SPSR NELLORE, SULLURPET, NELLORE, SRI POTTI SRIRAMULU NELLORE, ANDHRA PRADESH, INDIA - 524121
Whereas the above named Plaintiff has instituted a suit against you for recovery of money of Rs. 2,33,009/-. You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the 10-03-2026 at 1:00 PM failing which the matter will be decided exparte in accordance with law.
**By order of the court.**
**J.SRINIVAS REDDY**
Advocate,
Hyderabad.

## ఎంప్లాయిస్ గ్రీవెన్స్‌లో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జేసీకి వినతి



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19,ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డే సందర్భంగా గురువారం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు పంట అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పైన జిల్లా జాయింట్ కలెక్టర్, ఎం వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు డివిజన్ అధ్యక్షులు నాగేశ్వరావు, గూడూరు డివిజన్ అధ్యక్షులు గిద్దలూరు రమణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కన్య ధార, రవిశంకర్ నాయుడు, నాగేంద్ర కుమార్, కంచి చంద్రశేఖర్, జనార్ధన్, గూడూరు డివిజన్ కార్యవర్గ సభ్యులు దాసరి హనుమంతయ్య, గూడూరు మండలం అధ్యక్షులు రాధాకృష్ణ, గ్రేడ్ 2 వీఆర్వోల సంఘం జిల్లా మహిళ నాయకులు, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## టౌన్ బస్సుల అక్రమాలపై 20న భారీ ఆందోళన

### ఆటో కార్మికుల జీవనోపాధి కాపాడాలని డిమాండ్




**తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 19,ప్రభాతవార్త :** నిబంధనలు అతిక్రమిస్తూ ఇష్టానుసారంగా తిరుగుతున్న ప్రైవేటు టౌన్ బస్సులపై తక్షణ చర్యలు తీసుకోవాలని నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం డిమాండ్ చేసింది. బస్సులు కేటాయించిన మార్గాలు, సమయాలను పాటించకుండా యథేచ్ఛగా నడుస్తుండటంతో ఆటో కార్మికుల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటోందని సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు కోలగట్ల సురేష్, కార్యదర్శి మారుబోయిన రాజా మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల్లో టౌన్ బస్సులు అధికారుల అనుమతుల మేరకు నిర్ణయించిన మార్గాలు, సమయాలను పట్టించుకోకుండా తమకు నచ్చిన రూట్లలో తిరుగుతున్నాయని ఆరోపించారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న వందలాది మంది ఆటో డ్రైవర్ల ఆదాయం కోల్పోతున్నారని తెలిపారు. ఈ విషయమై రవాణా శాఖ అధికారులకు పలుమార్లు అర్జీలు సమర్పించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు విమర్శించారు. ప్రైవేటు యాజమాన్యాలను పిలిపించి చర్చించడం గానీ, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు చేపట్టడం గానీ జరగలేదని పేర్కొన్నారు. ఆటో కార్మికులు ప్రశ్నిస్తే కొందరు బస్సు డ్రైవర్లు దౌర్జన్యాలకు పాల్పడుతూ బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఘటనలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. నెల్లూరు రూరల్ పరిధిలోని కొత్తూరు శ్రామికనగర్ వైపు, నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ నుండి అయ్యప్పగుడి వరకు, అలాగే ఇందుకూరుపేట వైపు నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు బి.వి.నగర్ నుండి రవాణా శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై ఆందోళనను విజయవంతం చేయాలని సంఘం పిలుపునిచ్చింది.

## ఆర్ఎస్ఎస్ సేవకుల పై కమ్యూనిస్టుల దాడి అమానుషం



**పొదలకూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** ఆంధ్ర యూనివర్సిటీలో మంగళవారం నాడు ఆర్ఎస్ఎస్ శాఖ జరుగుతుండగా వామ పక్షవాదులు స్వయం సేవకుల మీద దాడి చేయడం అమానుషమని దాడిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ సీనియర్ నేత మిడతల రమేష్ అన్నారు. పొదలకూరు లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భరతమాతను కీర్తిస్తూ ప్రార్ధన చేస్తున్న సమయంలో ఆ ప్రార్ధనను వినడానికి ఇష్టపడని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ముసుగులో వామపక్షాల గుండాలు దాడి చేయడం బాధాకరమన్నారు. స్వయం సేవకుల మీద పడిన ప్రతి దెబ్బ భరతమాత మీద పడినట్లేనని తెలిపారు. సెక్యులరిజం ముసుగు ధరించుకొని భారతదేశ జీవన విధానానికి సంబంధంలేని విదేశీ సిద్ధాంతాలతో వామపక్షాలు కొనసాగుతున్నాయని అన్నారు. భరతమాతను కీర్తిస్తున్న వారిపై దాడి చేయడం అంటే భారతీయుల ఆత్మ మీద దాడి చేసినట్లు గా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు చింత గింజల సుబ్రమణ్యం, రాచపూడి ధనుంజయ రావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## భర్త వేధింపులపై ఫిర్యాదు

**కోట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** : కోట మండలం విద్యానగర్‌కు చెందిన అన్విత తన భర్త వేణు, అత్త, ఆడబిడ్డ వేధిస్తున్నారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వాకాడు మండలం వెంకటరెడ్డిపాలెంకు చెందిన వేణుతో అన్వితకు వివాహమైంది. ఈ నేపథ్యంలో గత కొన్ని నెలల నుంచి తనను వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మేరకు ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కోటపూరిని పరామర్శించిన మాజీ మంత్రి



**కోవూరు ఫిబ్రవరి19 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు కోటపూరి రమణయ్య ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని తన గృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంతి తీసుకోవాలని రమణయ్యకు సూచించారు. ఈ కార్యక్ర మంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధకృష్ణారెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, సర్పంచ్ ఎస్‌కే అహ్మద్, మండల పార్టీ అధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమణమ్మ, గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఇంటర్ పరిక్షా పత్రాలు



**రాపూరు,ఫిబ్రవరి19ప్రభాతవార్త :** 23వ తేది నుండి జరగనున్న ఇంటర్ పరిక్షలకు సంబందించిన ప్రశ్నాపత్రాలు గురువారం రాపూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ మరియు కస్టోడియన్ చీఫ్ సూపరిడెంట్ బి. క్రిష్ణవేణి తెలిపారు. జిల్లా కేంద్రం నుండి పోలీసుల పహారా నీడలో ఈ ప్రశ్నా పత్రాలు పోలీస్ స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. రాపూరు పరిక్షా కేంద్రం జూనియర్ కళాశాలలో కండలేరు ఎపిఎస్ డబ్యూఆర్ జూనియర్ కళాశాల విద్యార్ధినీలు, సైదాపురం , రాపూరు కళాశాల విద్యార్ధులు ఈ పరిక్షలను వ్రాయనున్నట్లు తెలిపారు. ఈ పరిక్షలకు చేజర్ల కళాశాలలో జువాలజీ ఆధ్యపకునిగా పనిచేస్తున్న ఎల్లయ్యను డిపార్టమెంటల్ అధికారిగా నియమించినట్లు ఆమె తెలిపారు.

## గ్రంధాలయంలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**రాపూరు,ఫిబ్రవరి19ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని ప్రభుత్వ గ్రంధాలయంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 196వ జయంతి వేడుకలను గ్రంధాలయాధికారి ఎ. అంజయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంజయ్య మాట్లాడుతూ 1830వ సంవత్సరంలో నేటి రోజున శివాజీ జన్మించడం జరిగిందన్నారు. ఇస్లాం అసాంఘిక శక్తులు భారతదేశ సంస్కృతిక సంపదను ధ్వంసం చేస్తున్న తరుణంలో శివాజీ మహారాజ్ వారితో భీకరంగా పోరాడి అదే కోణంలో మన దేశ పౌరులందరు సామరస్య భావంతో మెలగాలని మతాధిపత్య ధోరణిని విడనాడాలని సూచించారన్నారు. హిందూ జాగృతి సేవా సమితీ బాధ్యులు యస్.ఆర్. పంతులు మాట్లాడుతూ భారత దేశ సామరస్యతను, సమరసతను,సమర్ధతను ప్రపంచ రాజ్యాలకు తెలిపిన మహోన్నత వ్యక్తి ఛత్రపతి శివాజీ మహారాజ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు శివాజీ అభిమానులు, గ్రంధాలయ పాఠకులు వున్నారు.

## వైభవంగా అన్నదానం



**కోవూరు ఫిబ్రవరి19 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో గురువారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. అన్నదాన కార్యక్రమానికి ఉభయకర్తలుగా దాసరి హిమవతి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా పొట్టేళ్ల కోటేశ్వరరావు



**నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా పొట్టేళ్ల కోటేశ్వరరావు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం నెల్లూరులోని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు దువ్వూరు శ్రీనివాసులు(పరశురాం) శిఫారెడ్డి వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొట్టేళ్ల కోటేశ్వరరావుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పొట్టేళ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా తనను నియమించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు శిఫారెడ్డి వంశీధర్‌రెడ్డికి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు దువ్వూరు శ్రీనివాసులు(పరశురాం)కు తమ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. అట్టడుగున ఉన్న ఎస్సీలను పార్టీ వైపు ఆకర్షితులను చేసి వారి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## రాములోరి గుడి నర్మాణానికి ఎజియన్‌కనష్టక్షన్ లక్షరూపాయల సాయం



**కలిగిరి, పిబ్రవరి19, ప్రభాతవార్త;** గతంలో రాములోరి లంకా మార్గమునకు ఉడతలు సామందించిన విదంగానే ప్రస్తుతం లాములోరి గుడి నిర్మాణానికి సాయమందించారు గడ్డం పకీరయ్య,గడ్డం రంజాన్‌లు. కలిగిరి మండలంలోని తూర్పు మాల పాలెంలో గ్రామస్తులు రాములవారి గుడిని నిర్మిస్తున్నారు. ఈక్రమంలో అదేగ్రామానికి చెందిన ఎజియన్ కనష్టక్షన్ అదినేతలైన గడ్డం రంజాన్, పకీరయ్యలు గుడినిర్మాణానికి తమ వంతు సహాయం అందజేశారు. ఆలయ నిర్మాణానికి తమవంతుగా రు. లక్షరూపాయల చెక్కును గురువారం నిర్వాహకులకు అందజేశారు.గతంలో కూడా వీరు చదువుకొనే ఆర్ధిక స్తోమత లేని అనేకమంది విధ్యార్డులకు తమ వంతు సాయం అందించి వారి చదువులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలియజేయడమే కాకుండా గుడినిర్మాణానికి ముందుకు వచ్చిన గడ్డం సోదరులను కొని యాడారు.

## అంత్యక్రియలకు ఆర్ధికసాయం చేసిన సంయుక్త సేవాసంస్థ



**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** కావలి పరిసర ప్రాంతమైన బుడంగుంట కాలనీలో నివాసం ఉన్న డయాలసీస్ బాదితుడు బండి త్రిమూర్తి అంత్యక్రియల నిమిత్తం సంయుక్త సేవాసంస్థ సభ్యులు ఎస్ఐ ఒట్టూరు శ్రీనివాసులు, జి.శాంతి వర్ధన్, కె.శ్రీనివాసరావు, తన్నీరు రవికుమార్, ఏఎస్ఐ మార్టూరు పరమేశ్వరి, నేలపాటి వెంకటరమేష్, రామ్మూర్తి, సంయుక్త నృత్యకళా నిలయం నాట్య గురువు జి.లిఖితల సహకారంతో రూ.6వేలను అతని భార్య కవితకు సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నెలలుగా అనారోగ్యం కారణంగా ఉడాయలసీస్ చేయించుకుంటున్న బండి త్రిమూర్తి ఆరోగ్యం మరింత క్షీణించడంతో మృతి చెందడం జరిగిందన్నారు. అంత్యక్రియలకు ఆర్థికస్తోమత లేక మా సంయుక్త సేవాసంస్థవారి కుటుంబసభ్యులు ఆశ్రయించడంతో తమసంస్థ సభ్యుల సహకారంతో గురువారం వారి ఇంటికి వెళ్ళి అంత్యక్రియల నిర్వహణకు ఆర్తిక సాయం చేయడం జరిగిందన్నారు. త్రిమూర్తికి సాయం అందజేసిన సంస్థ సభ్యులకు దన్యవాదాలు తెలియచేస్తూన్నామని తెలిపారు. ఈసందర్భంగా బాదిత కుటుంబసభ్యులు సంయుక్త సేవాసంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి



**కోట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** బాల్య వివాహాలను అరికట్టాలని కోట సిడిపిఓ మునికుమారి కోరారు. గురువారం కోట మండలం గూడలిలోని గిరిజన కాలనీలో బాల్య వివాహాల నిరూమ్లనపై అవగాహన కల్పించారు. నిరక్షరాస్యత వలన బాల్య వివాహాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. హింస, వేధింపులు, ప్రసూతి మరణాలు, శిశు మరణాలు పేదరికంపై దెబ్బ తీస్తాయన్నారు. బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలుశిక్ష పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, సుగుణ, తులసి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ గోవిందయ్య



**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** కావలి మండలంలోని మార్కండేయపురం పాఠశాలలను గురువారం మండల విద్యాశాఖ అదికారి బండి గోవిందయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను, అసెస్మెంట్ బుక్కులు, హోలిస్టిక్ ప్రోగ్రెస్‌కారుడలు జి.ఎఫ్ఎల్ఎన్ తదితరాలను పరిశీలించారు. బాలబాలికల సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులకు విలువైన సలహాలు, సూచనలను అందించారు. పాఠవాలకు ప్రవహరీని, శిదిలావస్థలో ఉన్న పాతభవనం స్తానంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు ఉన్నతాధికారులకు సిపారసు చేయాలని పాఠశాల విద్యాకమిటీ ఛైర్మెన్ స్వాతి శ్రీనివాసులు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్ళారు. సానుకూలంగా స్పందించిన ఎంఈఓ ధన్యవాదములు తెలిపారు. పాఠశాల సమస్యలను పరిష్కరిస్తూ ఉనన్త సేవలు అందిస్తున్న ఎంఈఓ గోవిందయ్యను హెచ్ఎం పి.చెన్నక్రిష్ణయ్య, ఉపాధ్యాయులు, టి.రామక్రిష్ణారెడ్డి, విద్యార్తిని, విద్యార్థులతో కలసి శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంఈఓ శ్రీరాంపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాల, కరివేటి వారిపాలెం ప్రాథమిక పాఠశాలలో కూడా తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలోని రోల్ పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఎంఈఓ వెంట సిఆర్ఎంటి వై.రమణయ్య ఉన్నారు.

## న్యాయమైన డిమాండ్‌లు తీర్చకుంటే దీక్షలు ఉధృతం చేస్తాం



**కోవూరు ఫిబ్రవరి19 ప్రభాతవార్త :** సహకార సంఘాల్లో 2019 తర్వాత ఉద్యోగంలో చేరిన వారందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నామని ప్రభుత్వం ఈ విషయంలో కాలయాపన చేయడం సరైనది కాదని ఉమ్మడి నెల్లూరు జిల్లా సహకార సంఘాల యూనియన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని రైల్వే రోడ్డులో ఉన్న ఎన్‌డీసీసీ బ్యాంక్ ఆవరణంలో జేఏసీ ఆధ్వర్యంలో గురువారం రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నెంబర్ 36ను అమలు చేయాలన్నారు. తాము ప్రభు త్వం తరపున రైతులకు అనేక సేవలను నిరాటంకంగా అందిస్తూనే ఉన్నామన్నారు. మా డిమాండ్లు నెరవేర్చడం వలన ప్రభుత్వానికి ఎటువంటి నష్టం వాటిల్లదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తాము అడిగే న్యాయమైన కోర్కెలను తీర్చడం ప్రభుత్వ బాధ్యత అని లేనిపక్షంలో తాము చేస్తున్న దీక్షలను రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మరింత ఉధృతం చేస్తామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు సురేష్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి ప్రసంగించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో కోవూరు మండలంలోని సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## గొప్ప మహోన్నతుడు చత్రపతి శివాజీ



**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** దేశంలో వర్ణ వ్యవస్థను మొట్టమొదట ఎదరించిన గొప్ప మహోన్నతుడు చత్రపతి శివాజీ అని న్యాయవాది సామాజికవేత్త ఇర్ల వెంకటరమణయ్య తెలిపారు. చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని చత్రపతి శివాజి విగ్రహానికి ఇర్ల వెంకటరమణయ్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నిరవాళులర్పించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో సామాజిక రాజకీయ విప్లవానికి నాంది పలికి యుద్ధవీరుడుగా చత్రపతి శివాజి ఖ్యాతి గడించారని ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ, నరసింహం, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో చురుగ్గా దూసుకుపోతున్నా ఎమ్మెల్యే
## 6 కోట్ల 30 లక్షలతో రోడ్డు పనులు ప్రారంభం





**కొడవలూరు,విడవలూరు ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిలో దూసుకుపోతున్నారు. ప్రజా ప్రతినిధులు సహకారంతో గ్రామాల్లో మౌలిక వసతులు, పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. ఇటీవలనే బుచ్చిరెడ్డిపాలెం నుండి విడవలూరు మండలం ఊటుకూరు గ్రామం వరకు ఆర్ అండ్ బి రోడ్డు ఏర్పాటుకు 6 కోట్ల 30 లక్షలు నిధులు మంజూరై వేగవంతంగా రోడ్డు పనులు సాగుతున్నాయి. అంతేకాకుండా ఎమ్మెల్యే నేతృత్వంలో పారిశుధ్య పనులు,ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలను, ప్రజాప్రతి నిధులను సమన్వయం చేస్తూ నిధుల సద్వినియోగం, గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం విశేషం.

## బాధితులను ఆదుకోవడం అదృష్టంగా భావించాలి



**నెల్లూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త వైద్యం :** క్యాన్సర్, టీబీ తదితర వ్యాధులకు గురైన బాధితులను ఆదుకోవడం ప్రతి ఒక్కరు అదృష్టంగా భావించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్ వలీ అన్నారు. గురువారం కొండాయపాలెం అబైడింగ్ హోప్ ట్రస్టులో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు చైర్మన్ డాక్టర్ నిర్మల్ కుమార్ గత నాలుగు సంవత్సరాల నుండి టీబీ, క్యాన్సర్ బాధితులతో పాటు చిన్నారులకు ఒక్కొక్కరికి 1500 రూపాయల విలువైన న్యూట్రిషన్ ఫుడ్ పాకెట్లు నెలకు 600 మందికి అందజేయడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం అందించే మందులతో పాటు న్యూట్రిషన్ ఫుడ్ తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. చాలా మంది ధనవంతులు ఉన్నారని కొందరు మాత్రమే మన స్ఫూర్తిగా సేవ చేస్తారని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారికి న్యూట్రిషన్ ఫుడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. నేడు పుట్టిన రోజు జరుపుకుంటున్న డాక్టర్ నిర్మల్ కుమార్‌ను అభినందించి ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్మల్ కుమార్ మాట్లాడుతూ న్యూట్రిషన్ ఫుడ్ ప్యాకెట్లను ఎన్జీవోలు ప్రభుత్వ అధికారుల సహాయంతో ప్రతి నెల అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు జయప్రకాష్, ఫాదర్ లివింగ్టన్ సిస్టర్ రమ, సిస్టర్ జయ, మరియమ్మ, నళిని, నిర్మల, విలియమ్స్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలి



**నెల్లూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త –వైద్యం :** జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా వైద్య ఆరోగ్యశా ఖాదికారిణి వి.సుజాత ఆదేశానుసారం గురువారం దరామిట్టలోని శిశు గృహ, బాలసదన్ బాలికల హాస్టల్‌లో శిశువులకు, బాలికలకు పట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చంద్రమౌళి నగర్, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌పీ, ఎన్‌బీటీ కాలనీ వైద్యాధికారిణి డాక్టర్ అన్విత మాట్లాడుతూ వసతి గృహంలో ఉన్న బాలికలు వారి ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని, సీజనల్‌గా వస్తున్న వ్యాధులు జలుబు, దగ్గు, జ్వరం, వాంతి, విరోచనాలు తదితర వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ప్రతి రోజు చదువుతోపాటు కొద్దిసేపు ధ్యానం, వ్యాయామం కూడా చేస్తే మంచిదన్నారు. మీకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకుంటూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఈ శిబిరంలో అవరమైన పలువురు బాలికలకు మందులు అందజేశారు. అనంతరం పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌ఎస్పీ ఎన్బీటీ కాలనీ వైద్యాధికారిణి డాక్టర్ పి.రీనా భారతి, శిశు గృహ సూపరింటెండెంట్ లక్ష్మీ, బాలసదన్ మేనేజర్ దుర్గాదేవి, సూపర్‌వైజర్ రమణి, కోఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు, జిల్లా పీహెచ్‌పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, ఏఎన్ఎం హైమావతి, ఆశా వర్కర్ ప్రసన్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘ ఉద్యోగుల ధర్నా



**కోట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** కోటలో కోఆపరేటివ్ బ్యాంకులో గురువారం మండలంలోని ఐదు సహకార సంఘాల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు కోట బ్రాంచి ఉద్యోగులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జెఏసి నాయకులు రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జిఓ నంబర్ 36ను వెంటనే అమలు చేసి 2019-2024లో పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేయాలని, అప్పటి వరకు మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు చెల్లిస్తున్న రెండు లక్షల గ్రాట్యుటీపై సీలింగ్ అమలు చేస్తున్నారని, గ్రాట్యుటీ చట్టాన్ని అమలుపరిచి చట్టప్రకారం చెల్లింపులు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు అమలయ్యే 62 ఏళ్ల పదవీ విరమణ వయస్సును తమకూ అమలు చేయాలని, 2019 తర్వాత చేరిన ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, ఉద్యోగులకు 5 లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా కల్పించాలని, ఉద్యోగి సర్వీసులో మరణిస్తే ఆ కుటుంబానికి ఆసరాగా 20 లక్షలు టర్మ్ ఇన్సురెన్స్ పాలసీ చేయించి భరోసా కల్పించాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు నిరవధిక సమ్మెలో కొనసాగుతామన్నారు. ఈ ధర్నాలో సిఇఓలు కె.శ్రీనివాసులు, ఎన్.శ్రీనివాసులు, గోపి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ప్రశ్నాపత్రాలు వచ్చేశాయ్

**కోట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 23 నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కోట పోలీసుస్టేషన్‌కు ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు చేరుకున్నాయి. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. ఈ నెల 23 నుంచి పరీక్షలు జరగనున్నాయి.

## ఛత్రపతి శివాజీ పోరాటాలు స్ఫూర్తిగా తీసుకోవాలి



**కోట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** మహారాజ్ ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిం చారు. కోట గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వ హిం చారు. అనంతరం కోట ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పం డ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

## పాలు, కోడిగుడ్ల ఉత్పత్తిపై రైతులు ప్రత్యేక చొరవ చూపాలి



**కోవూరు ఫిబ్రవరి19 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల సమావేశ మందిరంలో గురువారం కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాలకు సంబంధించిన పశు వైద్యాధికారులు , పారా సిబ్బందితో ప్రత్యేక సమీక్షను పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల్లో పాలు, కోడిగుడ్లు, మాంసం ఉత్పత్తిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో కంటే మెరుగైన ఉత్పత్తి చేసే విధంగా పాడి రైతులు సహకారం అందించాలన్నారు. ముఖ్యంగా నాణ్యమైన పశువుల పెంపకానికి ప్రభుత్వం కల్పిస్తున్న పెయ్యిదూడల పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసుకునేలా పాడి రైతుల్లో మరింత అవగాహన పెంచాలన్నారు. రానున్న రోజుల్లో ఈ మూడు విషయాలపై మరలా ప్రత్యేక సమీక్ష నిర్వహించడం జరుగుతుందని ఈ లోగా రైతులకు ఈ విషయాలపై పూర్తిస్తాయిలో అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ షబానా, డాక్టర్ సుష్మ, రెండు మండలాల గ్రామ పశు సహాయకులు ఉన్నారు.

## భూ వివాదంపై ఆర్‌డిఓ విచారణ



**అనంతసాగరం, ఫిబ్రవరి19,ప్రభాతవార్త:** మండలంలోని సంజీవనగర్ లో భూ వివాదంపై ఆత్మకూరు ఆర్‌డిఓ బి.పావని గురువారం విచారణ చేపట్టారు. ఇరువర్గాల వాదనలు విన్న ఆమె వారి నుండి వివరాలు సేకరించారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆత్మ కూరు డియస్పీ వేణు గోపాల్, సిఐ శ్రీని వాసులురెడ్డి, స్థానిక ఎస్ఐ సూర్య ప్రకాష్ రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొ న్నారు.

## గౌతంరెడ్డి వర్ధంతిని విజయవంతం చేద్దాం - పిచ్చిరెడ్డి



**అనంతసాగరం, ఫిబ్రవరి19,ప్రభాతవార్త :** మాజీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి 4వ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతంగా చేద్దామని అనంతసాగరం మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ శనివారం మాజీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి 4వ వర్ధంతి వేడుకలను మండల కేంద్రమైన అనంతసాగరంలో నిర్వహిస్తామన్నారు. మండలంలోని వైసిపి నాయ కులు , కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతంగా చేయాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్యే పదవికే వన్నె తెస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

### వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ



**బుచ్చి ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్యే పదవికే వన్నె తెస్తున్నారని వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ ప్రశంసించారు. అసెంబ్లీలో ఆమె గళం వింటుంటే మహిళా శక్తి ఏమిటో అర్థమౌతుందని కొనియా డారు. ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడు గుపెట్టినప్పటి నుండి ఆమె గళం వినిపిస్తునే ఉందని అన్నారు. ప్రస్తుతం సైబర్ క్రైం సమస్యపైన, సైబర్ మోసాల గురించి ఆమె హోంమంత్రి అనిత దృష్టికి తీసుకొని వెళ్ళడం అభినందనీయమని అన్నారు. సైబర్ క్రైం ప్రస్తుతం చాలాఇబ్బంది కరంగా ఉందని ఎంతో మందిఅమాయకులు బలౌతున్నారు. అటువంటి సమస్యపై ఆమె అసెంబ్లీలో తన గళం వినిపించడం ప్రశంసనీయమని అన్నారు. కోవూరు వైద్యశాలను వంద పడకల హాస్పటల్‌గా అప్‌గ్రేడ్ చేయ మని ఆమె అసెంబ్లీలో ప్రభుత్వాన్నికోరడం హర్షనీయమని అన్నారు. ఆమెఅసెంబ్లీలోమాట్లాడే విధానం చూ స్తుంటే మహిళలమైన మాకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు. ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి



**సైదాపురం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త** మండలంలో పొలాలు కలి గిన ప్రతి రైతు తప్పనిసరిగా విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి తెలిపారు. మండల పరిధిలోని గులించర్ల గ్రామంలో ఉన్న రైతు సేవ కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలువురు రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగా హన తెలిపి యాప్‌లో నమోదు చేశారు. అనంతరం ఆమె మాట్లా డుతూ విశిష్ట సంఖ్య కలిగిన రైతులకు భవిష్యత్తులో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఓటీపీ లింక్ కలిగిన మొబైల్‌ను తీసుకెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి వెంటనే విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని సూ చించారు. ఆమె వెంట వ్యవసాయ సహాయకులు శ్యామ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## తరుణవాయిలో లేగదూడల అందాల పోటీలు



**సంగం ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** సంగం మండలం తరుణవాయి గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆద్వర్యంలో లేగ దూడల అందాల పోటీల నిర్వహణ కార్యక్ర మాన్ని చేశారు..ఈకార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా ఎస్ ఎస్ఎస్ సెమన్ ద్వారా జన్మించిన పెయ్య దూడల ప్రదర్శన నిర్వహించారు. దూడలను శాస్త్రీయ పద్ధతిలో పెంచాలని రైతులకు అవగాహన కల్పించాలని ఆత్మకూరు అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్‌రెడ్డి ,డిఎల్‌డిఎ డిప్యూటి డైరక్టర్ శ్రీనివా సులు సూచించారు. ఆరోగ్యవంతమైన పశువుల పెంపకం ద్వారా ఆదాయం పెంపుదలపై రైతులకు అధికా రులు సూచనలు చేశారు. అత్యుత్తమంగా పెంచిన దూడల యజమానులకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఏడి డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, డిఎల్‌డిఏ డిప్యూటి డైరక్టర్ శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల వెల్లువ

### - కలెక్టరేట్‌లో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహణ



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త** ఉద్యోగుల గ్రీవెన్స్ డేను జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డేలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులు వారి వారి సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ ప్రతి ఉద్యోగునితో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సంబంధిత దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు అందజేసి నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. పలువురు ఉద్యోగులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్‌పై తనిఖీ చేసిన కమిషనర్ వైఎ.నందన్



**నెల్లూరు కార్పోరేషన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఎ.నందన్ పారిశుద్ధ్య నిర్వహణ పనుల తనిఖీలలో భాగంగా స్థానిక 2వ డివిజన్ గుడిపల్లిపాడు ప్రాంతంలో అధికారులతో కలసి గురువారం పర్యటించారు. స్థానికంగా ఉన్న డ్రైన్ కాలువలు,సీసీరోడ్ల నిర్మాణం, తాగు నీటి సరఫరా, విద్యుత్‌వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర మౌలిక వసతులను అధికారులతో కలసి పరిశీలించి వివిధ సూచనలు జారీ చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న లేవుట్లలో నిర్మిస్తున్న నూతన భవనాలకు అనుమతులను పరిశీలించారు. నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనముతులు మేరకు మాత్రమే భవనాలను నిర్మించేలా పర్య వేక్షించాలని టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని రెవెన్యూ వసూల్ళను నిర్దేశించిన సమయంలో పూర్తిగా వసూలు చేయాలని కమిషనర్ ఆదేశించారు.నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మునునూరు కార్డెన్‌సర్చ్‌లో 17బైక్‌లు 1ఆటో పట్టివేత

### డిఎస్‌పి శ్రీధర్



**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** : నెల్లూరు జిల్లా ఎస్‌పి అజిత్‌వెజెండ్ల ఆదేశాల మేరకు కావలి ముసునూరు ఒరిస్సా కాలనీ నందు కావలి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కార్డెన్‌సెర్చ్ నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా కాలనీలో ఇంటింటికి తిరిగి తనిఖీలు నిర్వహించడం జరిగింది. సరైన పత్రాలు లేని 17బైకులు, ఒక ఆటోను స్టేషన్‌కు తరలించారు. కాలనీవాసులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం డిఎస్‌పి శ్రీధర్ మాట్లాడుతూ గంజాయి మా ద్రకద్రవ్యాలు ఎక్కడైనా ఉన్నట్లేతే సమాచారం తెలపాలని కోరారు. అపరిచిత వ్యక్తులు తిరుగుతున్నట్లయితే సమాచారం ఇవ్వాలని ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు జరిగిన ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ సిఐ రాజేశ్వరరావు, ఎస్ఐ బాజీబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొదలకూరు ఆర్టీసీ బస్ స్టేషన్‌ను అభివృద్ధి చేస్తాం

### - నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్



**పొదలకూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త** పొదలకూరు ఆర్టీసీ బస్ స్టేషన్‌ను అభివృద్ధి చేస్తామని, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని నెల్లూరు జోనల్ ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఈ బస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి అక్కడి సౌకర్యాలు, కొనసాగుతున్న అభివృద్ధి పనుల ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్ స్టేషన్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరై పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. వర్షాకాలంలో మట్టి, నీటి నిల్వల కారణంగా ప్రయా ణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు. అలాగే ప్రయాణికుల కోసం తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు, కూర్చునే బెంచీలు తదితర వసతులను మెరుగుపరచాలని సూచించారు. బస్ స్టేషన్ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి రోజు శుభ్రపరిచే చర్యలు క్రమం తప్పకుండా కొనసాగించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం ప్రారంభమైన తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించడం వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు రాకపోకలు పెరిగి, ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చిందన్నారు. బస్ స్టేషన్‌ను ప్రజలు విస్తృతంగా ఉపయోగించుకుంటేనే దీని అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. స్థానికులు తమ ప్రయాణాలకు ఈ కేంద్రాన్ని వినియోగించాలని ఆయన కోరారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పొదలకూరు బస్ స్టేషన్‌ను ఆదర్శవంతమైన కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు.

## ఆప్కో చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్ ను సందర్శించిన

## ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



**కోవూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలో చేనేత వస్త్రాలకు ప్రాచుర్యం కల్పించే దిశగా అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగణంలో ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన 12 స్టాళ్లను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సందర్శించారు. గురువారం స్పీకర్ అయ్యన్న పాత్రులు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తదితరులు, ఇతర ఎమ్మెల్యేలతో కలిసి స్టాళ్లను సందర్శించిన ఆమె.. ఈ సందర్భంగా వస్త్రాలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేసి వస్త్రాలు కొనుగోలు చేశారు. చేనేత వస్త్రాలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రాచుర్యం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలు కొనుగోలు చేయడం ద్వారా, నేతన్నలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ప్రజలంతా వారంలో ఒకరోజు చేనేత దుస్తులు ధరించడం ద్వారా సంప్రదాయమైన చేనేత వృత్తికి వెన్నుదన్నుగా నిలిచేవారవుతారని చెప్పారు.

## ఆశ్వవాహనంపై దర్శనమిచ్చిన మల్లన్న భారీ అన్నసంతర్పణ





**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** కావలి పాత ఊరు శివాలయంలో శ్రీ దుర్గా భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మో త్సవాలు కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సూచనలతో ఆలయ ఈఓ అరవ రాధాక్రిష్ణ సహకారంతో వ్యవస్థాపక దర్మకరత కసవరాజు వెంకట మల్లికార్జున క్రిష్ణమోహన్ సలహాలతో ప్రధాన అర్చకులు శశిధర్ గురుకుల్ పర్యవేక్షణలో జరుగుతున్నవి. అందులో భాగంగా బుధవారం రాత్రి స్వామివారిని పుష్పాలతో అలంకరించి మేళతాళాలతో భాణసంచా పేల్చి స్వామి వారిని అశ్వవాహనంపై గ్రామోత్సవం అత్యంత కన్నుల పండుగ నిర్వహించడం జరిగింది. గ్రామోత్సవం నిర్వహించే ప్రాంతమంతా భక్తులు శివనామస్మరణలతో మారు మ్రోగింది. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు, ప్రజలు అదిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అక్కడ ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకోవడం జరిగింది. గురువారం మద్యాహ్నం భారీ అన్నదానంకార్యక్రమం జరిగింది. భక్తులు ప్రజలు వేలాదిగా పాల్గొనడం జరిగింది.

## దేశా బాషలందు తెలుగులెస్స



**అల్లూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** దేశా బాషలందు తెలుగు బాష లెస్స అన్ని తెలుగు బాష రచయిత పెరుగు రామక్రిష్ణ తెలిపారు. 21న జరుపుకునే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురష్కరించుకొని గురువారం అల్లూరులోని దేవిరెడ్డి శారదాచారిటబుల్‌ట్రస్ట్‌లోని విద్యార్థులకు తెలుగుబాష ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ముఖ్య అతిధిగా తెలుగుబాష రచయిత పెరుగు రామక్రిష్ణ విచ్చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభాబువు, కవులు, రచయితలు మాతృబాష అయిన తెలుగు ప్రాముఖ్యతను రచనల రూపంలో తెలిపారని తెలిపారు. ఎన్ని బాషాలు నేర్చుకున్న మాతృబాషను మరువరాదని విద్యార్థులకు తెలిపారు. మీ అందరికి విద్యను అందిసుతన్న దేవిరెడ్డి శారద హైస్కూల్‌కు మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం రచయిత పెరుగు రామక్రిష్ణను ట్రస్టు సభ్యులు దేవిరెడ్డి దశరత రామిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అడ్మిన్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత చౌదరి, రామచంద్రరావు, అద్యాపక సిబ్బంది విద్యార్తులు పాల్గొన్నారు.

## దామవరంలో విమానాశ్రయ భూములపై

## రెండో రోజు గ్రామసభ





**దగదర్తి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త** దగదర్తి మండలంలోని దామవరం గ్రామం నందు ఆర్డీవో వంశీకృష్ణ ఎమ్మార్వో లాజరస్ రెవెన్యూ అధికారుల సమక్షంలో దామవరం విమా నాశ్రయ భూములకు సంబంధించి గ్రామసభ రెండవ రోజు నిర్వహించడం జరిగింది. గ్రామ సభలో ఆర్డీవో ప్రతి రైతు సమస్యని వివరంగా తెలుసుకుని, నిజమైన హక్కు దారులను నమోదు చేయడం జరిగింది. నిజమైన హక్కు దారులు నష్టపోకుండా చూస్తామని త్వరిత గతిన రైతులకు పరిష్కారం అయ్యేలా చూస్తానని ఆర్డీవో వంశీకృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్య ప్రియాంక, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## దివంగత ఇందుపూరు శ్రీనివాసులురెడ్డికి ఘనమైన నివాళులు



**నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త** దివంగత టీడీపీ సీనియర్ నేత ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి ఉత్తరక్రియలు నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెంలో గురువారం జరిగాయి. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి హాజరై దివంగత శ్రీనివాసులురెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.ఆయనతో ఉన్న అనుబంధాన్నిగుర్తుకు తెచ్చుకున్నారు. పార్టీలకు అతీతంగా పలువురు నేతలు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై శ్రీనివాసులురెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

## ఉపాధి హామీ పనులపై గ్రామసభ



**సైదాపురం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త** మండల పరిధిలోని వేములచేడు గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో 2024-2025లో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రా మీణ ఉపాధి పనులపై సామాజిక తనిఖీల బృందం గురు వారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేపీ రాజు, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆయుష్ ఆసుపత్రుల నియంత్రణ బిల్లు పై హర్షం



**నెల్లూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెద్దఎత్తున ఏర్పాటవుతున్న ఆయుష్ క్లినిక్‌లు, ఆసుపత్రులపై పర్యవేక్షణ, నియంత్రణకు ప్రతిపాదించిన సవరణ బిల్లును శాసనసభ ఆమోదించడం పట్ల ది మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా యూనిట్ ప్రెసిడెంట్ డాక్టర్ టీపీ నాయుడు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అలోపతి వైద్యం అందిస్తున్న ఆసుపత్రులపై ప్రభుత్వానికి ఇప్పటివరకు నియంత్రణ అధికారం ఉండేదని పేర్కొన్నారు. ఆయుష్ క్లినిక్లు, ఆసుపత్రులు పెరుగుతున్న నేపథ్యంలో వాటి పైనా ప్రభుత్వ పర్యవేక్షణ, నియంత్రణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే వీలు ఈ బిల్లు ద్వారా ఏర్పడిందని ఆనందం వ్యక్తం చేశారు. దీనివల్ల మిగతా వాటిలా ఆయుష్ క్లినిక్లు, ఆసుపత్రుల వివరాలు కూడా వైద్య ఆరోగ్య శాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని అన్నారు.దీంతో పుట్టగొడుగుల్లాగా అనుమతులులేకుండా వెలుస్తున్న ఆయుష్ ఆసుపత్రుల దోపిడీకి, అర్హతలు లేకుండా ఆయుర్వేదం పేరుతో చికిత్స చేసే వారిని కట్టడి చేయవచ్చన్నారు. ఏపీ అలోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టానికి సవరణను ప్రతిపాదించిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఆయన దన్యవాదాలు తెలియజేశారు.

## విద్యార్థులకు సివిల్స్ ఇంటర్వ్యూలు



**గూడూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త** గూడూరు రెండో పట్టణ పరిధిలోని మాళవ్యానగర్ ప్రాంతంలో ఉన్న శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఎస్.ఎస్.బి సివిల్స్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో పిల్లలకు సివిల్స్ స్థాయిలో విద్యాబోధన ఇవ్వడం,అందుకు అనుగుణంగా ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన వారికి రెండు దశలుగా మెయిన్స్ పరీక్షలు నిర్వహించడం జరిగిందని రామ్మోహన్, నరేంద్ర నాథ్ చౌదరి తదితరులు వివరించారు. ఈ కార్యక్రమంలో పురంధర్ రాజు, సింధు, పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు, డీన్ సునీల్ రాజు, అకాడమిక్ కో ఆర్డినేటర్ హరిక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు మెడికవర్ హాస్పిటల్‌లో అరుదైన ఎండోవ్యాక్

## అరుదైన చికిత్స : వృద్ధురాలికి ప్రాణదానం



**నెల్లూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త -వైద్యం** గొంతులో ఇరుక్కున్న చిన్న చికెన్ ఎముక కారణంగా ప్రాణాపాయ స్థితికి చేరుకున్న 65 ఏళ్ల వృద్ధురాలిని నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ వైద్యులు అత్యాధునిక సాంకేతికతతో విజయవంతంగా చికిత్స చేసి కాపాడారు. కావలి నివాసి కోటమ్మ చికెన్ తింటుండగా ఎముక గొంతులో ఇరుక్కుపో యింది. స్థానికంగా ఎముకను తొలగించినప్పటికి, కొద్ది రోజులకే తీవ్రమైన సమస్యలు మొదలయ్యాయి. ఎముక గుచ్చుకున్న కారణంగా అన్న వాహిక(ఈసోఫేగస్) గోడలో చిల్లు ఏర్పడి, లోపల ఇన్ఫెక్షన్ వ్యాపించింది. మెడ భాగం మొత్తం వాచిపోయి, శ్వాస తీసుకోవడం, నీళ్ల తాగడం కూడా కష్టంగా మారడంతో ఆమెను అత్యవసరంగా మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. రోగి పరిస్థితిని అందచా వేసిన ఈఎన్‌టీ అండ్ హెడ్ అండ్ నెక్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కడప నాగేంద్ర, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ మనోజ్ కుమార్, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వరుణ్ ప్రకాష్, చీఫ్ అనస్తీషియాలజిస్ట్ డాక్టర్ రంగనాథ్ సమిష్టిగా చికిత్స ప్రణాళిక రూపొందించారు. సాధారణంగా ఇలాంటి కేసుల్లో ఓపెన్ సర్జరీ అవసరమవుతుందని, అయితే రోగి వయస్సు, ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఎండోస్కోపిక్ సబ్ మ్యూకోసల్ డిసెక్షన్, అత్యాధునిక ఎండోవ్యాక్ థెరపీ ద్వారా చికిత్స అందించినట్లు వైద్యులు తెలిపారు. మెడపై చిన్న ఘాటు చేసి పేరుకుపోయిన పుయ్‌ను తొలగించి, ఎండోస్కోపీ సహాయంతో అన్న వాహికలో ఏర్పడిన చిల్లును సమర్థంగా మూసివేశారు. సమయానికి సరైన చికిత్స అందకపోతే ఇది ప్రాణాంతక పరిస్థితిగామారింది. ఎండోవ్యాక్ థెరఫీ వల్ల వద్ద శస్త్రచికిత్స అవసరం లేకుండా రోగిని కాపాడగలిగాం, అని వైద్య బృందం పేర్కొంది. ప్రస్తుతం కోటమ్మ సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ ఆహారం తీసుకుంటున్నారు. రోగి కుటుంబ సభ్యులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యం రంజిత్‌రెడ్డి, లావణ్య, డాక్టర్ అభిషేక్ వైద్య బృందాన్ని అభినందిస్తూ, క్లిష్టమైన కేసుల్లో కూడా అంతర్జాతీయ స్థాయి చికిత్స ను నెల్లూరు ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.

## సోమశిలలో ఘనంగా సరస్వతీదేవి పూజ



**అనంతసాగరం, ఫిబ్రవరి19,ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జిల్లాపరిషత్ ఉన్నతపాఠ శాలలో గురువారం ఘనంగా సరస్వతీదేవి పూజ నిర్వహించారు. పబ్లిక్ పరిక్షల సందర్భంగా 10వ తరగతి విద్యార్థులు సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట,పాటలతో అలరించారు. పాఠశాల యాజమాన్యం వచ్చినవారికి, విద్యార్థులకు విందు ఏర్పాటుచేశారు.ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు , పాల్గొన్నారు.

## కార్మికులు పథకాలపై అవగాహన పెంచుకోవాలి

### - సహాయ కార్మిక శాఖ అధికారి శ్రీకాంత్



**గూడూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త** అసంఘటిత కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అనేక పథకాలు ఉన్నాయని వాటిపై కార్మికులు అవగాహన పెంచుకోవాలని, దీనివల్ల ప్రభుత్వం ఆర్థికంగా సహాయం అందిస్తుందని గూడూరు సహాయ కార్మిక శాఖ అధికారి శ్రీకాంత్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని కార్మిక శాఖ కార్యాలయంలో సహాయ కార్మిక శాఖ అధికారి శ్రీకాంత్ విలేకరులతో మాట్లాడుతూ కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తుందని దీని కొరకు కార్మికులు సిఎస్‌సి కేంద్రాలు గ్రామ వార్డు సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు నమోదైన కార్మికులకు ప్రసూతి, వివాహ, సహజమరణ సహాయం అందించడం జరుగుతుందని కార్మికులకు ఉన్న పథకాల గురించి సమాచారం కావాలంటే కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## వర్చూసాలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమం



**నెల్లూరు , ఫిబ్రవరి 19 ప్రభాతవార్త - విద్య** ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి కార్యక్రమాన్ని గురువారం వర్చూసా లైఫ్ స్పేస్ ప్రైవేటు లిమిటెడ్ అధ్వర్యంలో రేబాలలోని భవిష్యనిధి ప్రాజెక్టులో ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతి నిదులు భవిష్యనిధిలోని ఛత్రపతి శివాజి విగ్రహానికి పుల మాలలు వేసి నివాళుల అర్పించారు. ఈ సందర్బగా వారు మాట్లడుతూ హిందూ మత అభ్యున తికి చత్రపతి శివాజి చేసిన కృషి భవిష్యత్ తరాలకి స్పూర్తి దాయకమన్నారు. మొగలుల ఆధిక్యానికి అడ్డుకట్టవేసిన ధీరుడు ఛత్రపతి అని కొనియాడారుఆయన ఆశయసాధనకు యువత కృషి చేయలని పిలుపునిచారు . హిందూధర్మ పరిరక్షణకోసం ప్రాణత్యాగం చేసిన చత్రపతిశివాజి , ఆయన కుమారుడి ఛత్రపతి శంభాజీ ల జీవిత గాధలని పాఠ్య పుస్తకాలలో లికించాలని కొరారు . వర్చూసా మేనేజర్ దివ్య , సిజిఎంలు అభినవ్‌రాజు, ఎస్‌కే. సత్తార్, ఎస్. విజయ్‌కుమార్, జీఎంలు ఎం.రంగారావు ,ఎం.వెంకటేశ్వర్లు, ఎం. గణేష్ , యూనరసింహరావు, జీ .జీవన్, డి మల్లిఖార్జున, ఇతర మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు

## వ్యక్తిగత పరిశుభ్రత పై ప్రత్యేక చొరవ



**కోవూరు ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థిని వ్యక్తిగత పరిశుభ్రత పై ప్రత్యేక అవగాహన చేసుకోవాలని పాత్ మోటివేషన్ ట్రైనింగ్ సెంటర్ రిసోర్స్ పర్సన్ ప్రియాంక తెలిపారు కోవూ రులోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహ సముదాయంలో గురువారం రాత్రి వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్య పరిశుభ్రత గుడ్డు టచ్ అండ్ బాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వ హించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా భోజనం చేసేముందు తప్పనిసరిగా ప్రతి విద్యా ర్థిని చేతులను పరిశుభ్రముగా ఉంచుకోకపోతే అంటూ రోగాలు సోకే అవకాశం ఎక్కువగా ఉందన్నారు దీన్ని వలన పక్క విద్యార్థులు కూడా ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందన్నారు వసతి గృహాల్లో చదివే ప్రతి వి ద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలు కనుగొనంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని పథకాలు వసతులను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు సాధ్యమైనంత వరకు సెల్ఫోన్ వాడకం పట్ల తగు జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న కొన్ని విషయాలపై ప్రతి విద్యార్థి పూర్తిస్థాయిలో అవగా హన చేసుకుని మంచేదో చెడేదో గుర్తించి దానికి అనుగుణంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ కిరణ్ పలు సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ వసతికుల సంక్షేమ అధికారులు పద్మ మేరీ సుప్రజ జ్యోతి రాణి తదితరులు ఉన్నారు ఈ సందర్భంగా వీడియో ద్వారా పలు విషయాలను అవగాహ కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు

## వృద్ధురాలికి న్యాయం చేస్తాం

### "వార్త కథనానికి స్పందన "



**చేజర్ల ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** 80 సంవత్సరాల భగీరథ పోరాటం.... జిల్లా అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కిన చేజర్ల తహసిల్దారు అనే శీర్షికను ప్రముఖ దినపత్రిక వార్తలో గురువారం కథనం ప్రచురించడం జరి గింది. ఈ కథనానికి జిల్లా ఉన్నతా ధికారులు స్పందిం చారు. రెండు దశాబ్దాలుగా రెవిన్యూ కార్యాలయం చుట్టు తిరుగుతు న్యాయం కోసం పోరాడుతున్న వృద్ధురాలి పరి స్థితి పట్ల అధికార యంత్రాంగం స్పందించడంతో ఆశలు చిగురించాయి. జిల్లా రెవెన్యూ అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతు వృద్ధురాలి సమస్యను అత్యంత ప్రాధాన్యంగా పరిగణిస్తామని తెలిపారు. సంబందిత సమస్యపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇప్పటికే ఆత్మకూరు ఆర్డీవోకు, అలాగే చేజర్ల తహసిల్దారుకు ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు. పత్రికలో వచ్చిన కథనం అనంతరం విషయాన్ని సీరియస్‌గాతీసుకోని సంబందిత అధికారులను వివరణ కోరినట్లు తెలిపారు. ఈ సమస్యలు ఎక్కడ ఆలస్యం జరిగిందో,ఎలాంటి పరిపాలన లోపాలు ఉన్నాయో విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వృద్ధురాలి వయస్సును దృష్టిలో ఉంచుకోని ఫైల్‌ను అత్యవసరంగా పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు. అవసరమైతే స్వయంగా పరిశీలనకు వెళ్తామని తెలిపారు. ఎవ్వరైనా అదికారులు నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తేలితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతికా కథనం ద్వారా విషయం వెలుగులోకి రావడంతో అధికారులు స్పందిచండం పట్ల స్దానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా వృద్ధురాలి దీర్ఘకాలపోరాటానికి ముగింపు పలికి న్యాయం జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.